ఎలిగేడులో పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు సిద్ధం

- నెరవేరనున్న రెండున్నర దశాబ్దాల కళ
- మండల ప్రజలకు తగ్గనున్న దూరభారం


పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు అన్ని హంగులతో సిద్ధమైన భవనం

ఎలిగేడు: కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఎలిగేడు 57వ మండలంగా ఏర్పడింది. మండల ప్రజల రెండున్నర దశాబ్దాల (23ఏళ్ల)కల ఎలిగేడులో త్వరలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కల నెరవేరనుంది. 2001లో జూలపల్లి మండలం నుంచి వేరుచేసి అప్పటి ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి 10గ్రామాలతో ఎలిగేడు మండలంగా ఏర్పాటు చేయించి అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ప్రారంభించారు. మండలం ఏర్పడినప్పటికీ అప్పటి నుంచి ఎలిగేడులో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కాలేదు.

తగ్గనున్న దూరభారం

ఏదైనా సమస్య తలెత్తినప్పుడు మండల ప్రజలు వివిధ గ్రామాల నుంచి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలంటే జూలపల్లి పోలీసుస్టేషన్‌కు 10 నుంచి 18కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేంది. ఎలిగేడు మండల ప్రజాప్రతినిధులు, యువజనసంఘాల నాయకులు పలుమార్లు పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు, ప్రభుత్వ పెద్దలకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఎలాంటి స్పందన లేదు. అయితే గత ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఎలిగేడులో పోలీసుస్టేషన్ ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే విజయరమణారావు ఎన్నికల ప్రచారంలో మండల ప్రజలకు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు ఎలిగేడులో పోలీసుస్టేషన్ ఏర్పాటుకు గత డిసెంబర్ 2న జీవో విడుదల చేయించారు. ఇందులో భాగంగానే మండల కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయ భవనం ఖాళీగా ఉండడంతో ఆ భవనం పోలీసుస్టేషన్‌కు అనువుగా ఉంటుందని భావించారు. ఆ భవనాన్ని పోలీస్‌స్టేషన్‌కు అనువుగా మార్చి, ఆ భవనంలో విద్యుత్ సౌకర్యంతో పాటు, భవనానికి కలరింగ్ వేయించి, పోలీసుస్టేషన్ ఏర్పాటుకు సర్వం సిద్ధం చేశారు. ఇటీవల రామగుండం సీపీ శ్రీనివాస్ సందర్శించారు. ఫిబ్రవరిలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు జరగవచ్చని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

ఇచ్చిన మాట నెరవేర్చా



మండల ప్రజల చిరకాల వాంఛ అయిన పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయిస్తానని ఎన్నికల్లో ఎలిగేడు మండల ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా. పోలీస్‌స్టేషన్ మంజూరు చేయించా. త్వరలోనే ప్రారంభిస్తాం.

– విజయరమణారావు, ఎమ్మెల్యే, పెద్దపల్లి

సంతోషంగా ఉంది



ఏదైనా సమస్య తలెత్తినప్పుడు ఎలిగేడు ప్రజలు జూలపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలంటే దూరభారంతో ఇబ్బందులు పడేవారు. ఎలిగేడులో పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు అంతా సిద్ధం కావడం సంతోషంగా ఉంది. మండల ప్రజలకు పోలీస్‌స్టేషన్ ఏర్పాటు శుభపరిణామం.

– తాటిపల్లి సతీశ్‌బాబు, గ్రామస్తుడు, ఎలిగేడు

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



మా గ్రామం శివపల్లి నుంచి ఎలి గేడు మీదుగా జూలపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలంటే 18కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి ఉండేది. ఎలిగేడులో పోలీసుస్టేషన్ ఏర్పాటు కానుండటంతో కేవలం 5 నుంచి 6కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు కృషిచేసిన ఎమ్మెల్యే విజయరమణారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– దుగ్యాల సంతోష్‌రావు, గ్రామస్తుడు, శివపల్లి

రోడ్డుపైనే పార్కింగ్..

- ప్రమాదాలకు అడ్డాగా గౌతమినగర్ వారసంత సెంటర్
- రోడ్డుపైనే బైక్‌లు నిలుపుతున్న వైనం
- ఇబ్బందుల్లో పది గ్రామాల ప్రజలు
- పట్టించుకోని అధికారులు


గౌతమినగర్‌లో రోడ్డుపై పార్కు చేసి ఉన్న వాహనాలు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ పరిధిలోని కూరగాయల మార్కెట్ల అభివృద్ధికి 2018లో రూ.30లక్షల వ్యాయంతో 39వ డివిజన్ గౌతమినగర్‌లోని వారసంతను ఆధునీకరించారు. ప్రతీ బుధవారం నిర్వహించే గౌతమినగర్ కూరగాయల మార్కెట్‌కు పది గ్రామాల ప్రజలు వస్తారు. మార్కెట్ నిర్మించినా నిర్మాణ పనులు పూర్తయి ఐదేళ్లు గడిచినా వినియోగదారుల కోసం మార్కెట్ ప్రాంగణంలో పార్కింగ్ ఏర్పాటు చేయలేదు. మార్కెట్‌కు వచ్చిన వినియోగాదారులు బైక్‌లు నడిరోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. దీంతో గౌతమినగర్ నుంచి ఫెర్టిలైజర్ సిటీ టౌన్‌షిప్ మీదుగా పది గ్రామాలకు వెళ్లే ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రద్దీగా మార్కెట్

పది గ్రామాలకు ఇదే ప్రధాన మార్కెట్. సాయంత్రం సమయంలో వివిధ కాలనీలు, గ్రామాల నుంచి కూరగాయలు కొనేందుకు రావడంతో మార్కెట్ మొత్తం రద్దీగా ఉంటుంది. మార్కెట్ జరిగే సమయంలో రోడ్డుపై అడ్డంగా వాహనాలు పార్క్ చేసి ఉండడం, మార్కెట్‌కు దగ్గరలో వైన్ షాప్ ఉండడంతో మద్యం మత్తులో మందుబాబులు రోడ్డుపైకి వచ్చి ప్రమాదాలకు కారణం అవుతున్నారు. అధికారులు స్పందించి వారసంతలో ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసేందుకు ఖాళీ స్థలం ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పార్కింగ్ స్థలంలో మొక్కలు, షాపులు..

కూరగాయల మార్కెట్‌లో పార్కింగ్ స్థలంలో కార్పొరేషన్ అధికారులు హరితహారం మొక్కలు నాటడంతో పార్కింగ్ స్థలం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి పార్కింగ్ స్థలంలో నాటిన మొక్కలు తొలగించి వాహనాలు పార్కింగ్ చేసేందుకు వీలు కల్పించాలని వినియోగదారులు కోరుతున్నారు.

ట్రాఫిక్‌ను నియంత్రించాలి..

గౌతమినగర్ వారసంత ప్రతీ బుధవారం నిర్వహిస్తారు. వారసంతలో సాయంత్రం ఆర్ఎఫ్‌సీఎల్ ఉద్యోగులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూరగాయలు కొనేందుకు రావడంతో సాయంత్రం సమయంలో ఎక్కువ రద్దీగా ఉంటుంది. వ్యాపారం జరిగే సమయంలో ద్విచక్ర వాహనదారులు బైక్‌లను రోడ్డుపై పార్క్ చేయడంతో ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. అధికారులు స్పందించి వారసంత జరిగే సమయంలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేయాలని గ్రామాల ప్రజలు విన్నవిస్తున్నారు.

అధికారులు స్పందించాలి

మార్కెట్ ప్రాంగణంలో వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన స్థలంలో కార్పొరేషన్ అధికారులు మొక్కలు నాటడంతో ద్విచక్ర వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు పార్క్ చేస్తున్నారు. అధికారులు స్పందించి మొక్కలు తొలగించి ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసేలా సౌకర్యం కల్పించాలి.

– కల్వల సంతోష్, శాంతినగర్

రోడ్డుపై పార్కింగ్ చేయడంతో..

కార్పొరేషన్ అధికారులు పార్కింగ్ స్థలం కేటాయించక పోవడంతో వినియోగదారులు గౌతమినగర్ ప్రధాన చౌరస్తాలో రోడ్డుకు అడ్డంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి మార్కెట్ వ్యాపారం నిర్వహించే సమయంలో రోడ్డుపై పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలి.

– కాంపల్లి రఘుబాబు, గౌతమినగర్

పర్యావరణ పరిరక్షణకు లయన్స్‌క్లబ్ కృషి


సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ధర్మారం: పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నివారణ కోసం సమష్టిగా కృషిచేయాలని ప్రముఖ కవి, కళాకారుడు జయరాజ్ కోరారు. మండలంలోని ఎర్రగుంటపల్లి మహేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఆదివారం లయన్స్‌క్లబ్ రీజినల్ చైర్మన్ తన్నీరు రాజేందర్ ఆధ్వర్యంలో రీజినల్ మీట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జయరాజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లయన్స్‌క్లబ్ ప్రజాసేవలో ప్రపంచవ్యాప్తిగా గుర్తింపు పొందిందన్నారు. క్లబ్ ద్వారా చేస్తున్న సేవలు పేద ప్రజానీకానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి సైతం ఆర్థికసాయం అందుతోందన్నారు. ప్లాస్టిక్ ప్రపంచానికి పెనుభూతంగా మారిందని, ప్రతీఒక్కరు ప్లాస్టిక్ నియంత్రణకు కృషిచేయాలన్నారు. లయన్స్‌క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయంలో రుద్రాభిషేకం

జూలపల్లి: మండల కేంద్రంలో అత్యంత ప్రాచీన, ప్రసిదద్దాలయం శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి ఉద్దండ నవీన్ తెలిపారు. ఉదయం నిర్వహించే రుద్రాభిషేకంలో మహిళలు స్వామివారి ప్రత్యేక పూజకు అవసరమైన పూలు, పండ్లు, పంచామృతాలు తీసుకుని పూజలో పాల్గొనాలని సూచించారు. అనంతరం మాజీ ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి, రాంగోపాల్‌రెడ్డి కుటుంబం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తుందని ఆలయ కమిటీ సభ్యులు పొట్టాల మల్లేశం, పాటకుల అనిల్, వజ్రారెడ్డి వివరించారు.

ప్రశ్నించే గొంతుకు ఓటేయండి

సుల్తానాబాద్: ప్రశ్నించే గొంతునే ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని యూటీఎఫ్ నేత అశోక్ కుమార్ కోరారు. పట్టణంలో ఆదివారం ఉపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు పాత్ర పోషిస్తానని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. నాయకులు బండిపెల్లి పర్శరాములు, లక్ష్మణ్, రాజమల్లు, అంజయ్య, సరేందర్, రవీందర్ పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న దళితులు

కమాన్‌పూర్: హైదరబాద్‌లో ఈ నెల 7న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించే లక్ష డప్పులు, వెయ్యి గొంతుకలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండలంలోని గుండారంలో ఆదివారం పోస్టర్ ఆవిష్కరించారు. మల్లారపు అరుణ్, దబ్బెట సంతోష్, సతీశ్, లింగయ్య, రాజయ్య, శంకర్, ఓదెలు, కనుకయ్య పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పెద్దపల్లిరూరల్: హైదరాబాద్‌లో ఈనెల 7న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ తలపెట్టిన లక్ష డప్పులు.. వేల గొంతుకల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. మాదిగలు ఇతర ఎస్సీ కులాలకు చెందిన వారంతా హైదరాబాద్ సభ విజయవంతం చేయాలని కోరారు. నాయకులు సిరిసిల్ల శంకర్, శ్రీనివాస్, మల్లేశ్, లక్ష్మణ్, రవి, మహేశ్, దుర్గయ్య, ఆశాద్రి, మధు, రవీందర్, మల్లేశ్ అనిల్ ఉన్నారు.

పాలకుర్తి: హైదరాబాద్‌లో 7న జరిగే లక్ష డప్పులు, వేల గొంతులు మహార్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ పాలకుర్తి మండల ఇన్‌చార్జి పల్లె బాపు, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి ముల్కల కొమురయ్య పిలుపునిచ్చారు. బసంత్‌నగర్ బస్టాండ్ వద్ద ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వడ్డేపల్లి సరేందర్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోస్టర్ ఆవిష్కరించారు. నలిగంటి శ్యాంకుమార్, బూడిద అనిల్‌కుమార్, చిలుముల ప్రశాంత్, రాజయ్య, శ్రీధర్, ముల్కల మహేందర్, సుదర్శన్, రాజేందర్, కుమారస్వామి, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞానయాత్రలో ప్రభుత్వ విద్యార్థులు


విజ్ఞానయాత్రలో ప్రభుత్వ విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని ఊశన్నపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆదివారం ములుగు జిల్లాలోని రామప్ప దేవాలయాన్ని, రామప్ప చెరువును సందర్శించారు. లక్నవరం లేక్‌లో బోట్లలో విహరించారు. ఉయ్యాల వంతెనపై సరదాగా సెల్ఫీలు దిగుతూ ప్రకృతిని ఆస్వాదించారు. రామప్ప దేవాలయంలో శిల్పులు చెక్కిన శిల్పాలు, దేవతా విగ్రహాలు, దేవాలయ చరిత్రను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. హెచ్ఎం ఈర్ల సమ్మయ్య, సహ ఉపాధ్యాయుడు అమృత సురేశ్‌కుమార్, కొంకటి శ్రీవాణి, బండారి ప్రవంతి ఉన్నారు.

క్లుప్తంగా

గాంధీనగర్ సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

గోదావరిఖని: గాంధీనగర్ కార్మిక కుటుంబాల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లో ఆదివారం బస్తీబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్మిక కుటుంబాలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కొంతకాలంగా ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేదని, దీంతో శుభ్రమైన మంచినీరు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. డ్రైనేజీ అస్తవ్యస్తంగా మారిందని, క్వార్టర్లు లోతట్టులో ఉండడంతో మురుగునీరు చేరుతోందని వాపోయరు. రోడ్లు, లైటింగ్ సరిగా లేవన్నారు. ఈ విషయంలో యాజమాన్యం వెంటనే జోక్యం చేసుకుని సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాయకులు ఆరెపల్లి రాజమౌళి, ఆసరి మహేశ్, వేణుగోపాల్‌రెడ్డి, జెల్ల గజేందర్, జంగపల్లి మల్లేశ్, దాసరి సురేశ్, జలగం సత్యనారాయణ, నంది నారాయణ, తిప్పారపు రాజు, మహేందర్ పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా చేయండి

సుల్తానాబాద్: పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో తాగునీరు రాకపోవడంతో మహిళలు ఖాళీ బిందెలతో ఆదివారం నిరసన తెలిపారు. రెండు నెలలుగా ఇబ్బంది పడుతున్నామని, అధికారులకు విన్నవించిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీటి సరఫరా ఎందుకు నిలిచిపోయిందో తెలియడం లేదని, మంచినీరు దొరక్క నరకయాతన అనుభవిస్తున్నామని కాలనీవాసులు వాపోయారు. మంచినీటి సరఫరా కోసం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన ప్రదర్శన చేస్తామని వారు పేర్కొన్నారు. సుభాష్ నగర్ మహిళలు పాల్గొన్నారు.

నేడు మల్లికార్జునస్వామి ఆలయానికి భూమిపూజ

ఎలిగేడు: మండలంలోని శివపల్లిలో సోమవారం ఉదయం 4:50గంటలకు మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ, శిలాన్యాసం శంకుస్థాపన పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు–పావని దంపతుల చేయనున్నట్లు ఆలయ కమిటీ, గ్రామస్తులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు


కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లిలోని మూర్తి విద్యాలయంలో 1998–99లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పద్మశాలీ కమ్యూనిటీ భవనంలో పూర్వ విద్యార్థుల సమ్మేళం నిర్వహించారు. తమ పాఠాలు చెప్పిన గురువులను సన్మానించారు.

గ్రామాల్లోనే పశు వైద్యసేవలు


వైద్యం చేస్తున్న సిబ్బంది

పెద్దపల్లిరూరల్: మూగజీవాలకు అవసరమైన వైద్యసేవలు గ్రామాలకే వెళ్లి అందించేందుకు వీలుగా సంచార పశువైద్యం ఉపకరిస్తుందని పశుసంవర్ధక శాఖ అధికారులు అన్నారు. పశువులకు అత్యవసరంగా వైద్య సేవలు అవసరమనుకునే పాడిరైతులు 1962 నెంబర్‌కు డయల్ చేసి సేవలు పొందవచ్చని వారు తెలిపారు. మండలంలోని గ్రామాల్లో పశువులకు వైద్యసేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

డాక్టరేట్ పొందిన సిరాజుద్దిన్‌కు సత్కారం



పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ప్రగతినగర్‌కు చెందిన మహమ్మద్ సిరాజుద్దిన్‌కు జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. పెద్దపల్లి సబ్ కోర్టు ఏజీపీ ఉప్పురాజు, తదితరులు ఆదివారం జరిగిన కార్యక్రమంలో సిరాజుద్దిన్‌ను సత్కరించారు. నాయకులు సుబ్బారెడ్డి, ఓదెలు, రాంచందర్, గౌసొద్దిన్, ఆరిఫ్, మొహియొద్దిన్, ఆసిఫ్, కాలిద్, సలీముద్దిన్, అఫ్జల్‌పాషా, ఉదయ్, యాదగిరి, మనోహర్, జాహిద్‌అలీ, ఇంతియాజ్, జావిద్ ఉన్నారు.



సుల్తానాబాద్: పట్టణంలోని మార్కండేయకాలనీలో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయం మూతపడడంతో నిరుపయోగంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. తిరిగి ప్రారంభించాల్సిన బాధ్యత ఉందని అంగన్‌వాడీ టీచర్లు అంటున్నారు. కార్యాలయాన్ని ప్రారంభిస్తే సుల్తానాబాద్, ధర్మారం, ఎలిగేడు, జూలపల్లి మండలాల పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు ఉపయోగకరంగా ఉంటుందని, అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

చందపల్లిలో నవగ్రహాల మందిరాల నిర్మాణం


ప్రతిష్ఠాపన కోసం నవగ్రహ ఆలయాలు సిద్ధం


శ్రీరాధా కృష్ణుడి ఆలయం

పెద్దపల్లిరూరల్: నవగ్రహాలకు వేర్వేరుగా మందిరాలను నిర్మించి ప్రతిష్ఠాపనకు సిద్ధం చేశారు. పెద్దపల్లి శివారు చందపల్లిలోని ఎస్సారెస్పీ ప్రధాన కాలువ సమీపంలో నవగ్రహాల కోసం వేర్వేరుగా తొమ్మిది మందిరాలను శ్రీకృష్ణ గోశాల నిర్వాహకుడు జాపతి రాజేశ్ ఆధ్వర్యంలో నిర్మించారు. ఇదే ప్రాంగణంలో శ్రీరాధ కృష్ణ ఆలయం, శివాలయాన్ని సైతం నిర్మించనున్నట్లు రాజేశ్ తెలిపారు. నవగ్రహాల్లో తమకు అవసరమైన గ్రహానికి భక్తులు పూజలు చేసుకునేందుకు వీలుగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రహాలకు అనువైన వృక్షాలను సైతం పెంచుతున్నామని వివరించారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న షీటీం ఇన్‌చార్జి లావణ్య

సుల్తానాబాద్: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని షీటీం ఇన్‌చార్జి లావణ్య అన్నారు. పట్టణంలోని బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులకు షీటీం ఆదివారం సైబర్ నేరాలపై, లైంగిక వేధింపులపై, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం బస్టాండ్, ప్రధాన కూడళ్లు, మాల్స్, వ్యాపార సముదాయాలు, రైల్వే స్టేషన్లు, కాలేజీల వద్ద నిరంతరం నిఘా ఉంటుందన్నారు. ఎవరైనా వేధింపులకు గురైతే షీటీంకు 63039 23700 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. షీటీం సభ్యులు స్నేహలత పాల్గొన్నారు.

ఖోఖో జట్టు కోచ్‌కు సన్మానం


సన్మానిస్తున్న యూనియన్ నాయకులు


ధర్మారం: మండలంలోని బంజేరుపల్లి తండా బి గ్రామానికి చెందిన జాతీయ స్థాయి ఖోఖో జట్టు కోచ్ ఇస్లావత్ నరేశ్‌నాయక్‌ను ఆదివారం గ్రామ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పత్తిపాక క్రాస్‌రోడ్డు వద్ద నరేశ్‌నాయక్‌కు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి తండా బి వరకు ర్యాలీగా తీసుకువచ్చారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనను సన్మానించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, ఎంప్లాయీస్ యూనియర్ అధ్యక్షుడు నున్సావత్ మోతిలాల్‌నాయక్, ప్రధాన కార్యదర్శి భధావత్ నరేశ్‌నాయక్, ఉపాధ్యక్షులు బానోత్ రామునాయక్, శంకర్‌నాయక్, కోశాధికారి ఇస్లావత్ శ్రీనివాస్‌నాయక్, ప్రకాశ్‌నాయక్, ప్రవీణ్, రవినాయక్, శంకర్‌నాయక్, రాజు నాయక్, ఇస్లావత్ రాజునాయక్, నరహరి నాయక్ పాల్గొన్నారు.

ఇంటికో డప్పుతో మాదిగలు తరలిరావాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న థామస్

సుల్తానాబాద్: హైదరాబాద్ ఈనెల 7న నిర్వహించే భారీ ప్రదర్శనకు ఇంటికో డప్పుతో మాదిగలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గుండా థామస్ పిలుపునిచ్చారు. సుల్తానాబాద్ మండల కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ కార్యాలయంలో ఆదివారం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షల డప్పులు, వేల గొంతుకల భారీ ప్రదర్శనకు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తిప్పారపు లక్ష్మణ్, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు కనకం శంకర్, సీనియర్ నాయకులు క్యాదాసి చంద్రమౌళి, ఎనగందుల నాంపల్లి, దాసరి సంపత్, ఆరెపల్లి రాహుల్, మాణిక్‌బాయ్, రాములు, అంజయ్య, చంద్రయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సేవాసంఘం గ్రామ అధ్యక్షుడిగా శ్రీనివాస్



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ గ్రామ పద్మశాలీ సేవాసంఘం అధ్యక్షుడిగా మిట్టపల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సమావేశంలో శ్రీనివాస్ వరుసగా మూడోసారి ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా కనకయ్య, ఉపాధ్యక్షుడిగా వేముల రాంచంద్రం, మిట్టపల్లి వెంకటేశం ప్రధాన కార్యదర్శిగా రాజేశం, సంయుక్త కార్యదర్శిగా పెండం భిక్షపతి, కోశాధికారి వేముల రమేశ్, లీగల్ అడ్వయిజర్‌గా ఆంజనేయులు, ప్రచార కార్యదర్శిగా బైరి వెంకటేశంతో పాటు ఐదుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.